సాక్షి అనకాపల్లి

శుక్రవారం । 21 । ఏప్రిల్ । 2023



సింహగిరికి పోటెత్తిన భక్తులు

సింహాచలం : గంధం అమావాస్య సందర్భంగా సింహాద్రి అప్పన్న దర్శనం కోసం గురువారం భక్తులు పోటెత్తారు.



పాన్ తప్పనిసరి

రూ.10 లక్షలు పైబడిన లావాదేవీకి కచ్చితంగా పాన్ అవసరమని రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ స్పష్టం చేశారు. 10లో

రంజాన్ వేళలు

అనకాపల్లి
ఇఫ్తార్ (శుక్ర)
6-18

నర్సీపట్నం
6-21

రైతు బాంధవుడు తులసీరావు



దివంగత విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి తులసీరావు రైతుల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. గురువారం చీడికాడ మండలం పెదగోగడలో డెయిరీ నూతన చైర్మన్ ఆనంద్‌కుమార్‌తో కలిసి కొత్తగా నిర్మించిన డెయిరీ పాలసేకరణ కేంద్రాన్ని ప్రారంభించారు. -8లో

పూర్తి స్థాయిలో వెంకన్న ఆలయ అభివృద్ధి

- ఉపమాకలో టీటీడీ జేఈవో వీరబ్రహ్మం పర్యటన
- అభివృద్ధి పనులపై స్థానికుల అభిప్రాయాల సేకరణ

నక్కపల్లి: ఉపమాక వేంకటేశ్వరస్వామి గుడిలో త్వరలో పూర్తి స్థాయిలో అభివృద్ధి పనులు చేపడతామని టీటీడీ జేఈవో వీరబ్రహ్మం తెలిపారు. గురువారం ఆయన ఉపమాకలో పర్యటించారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం ఆలయంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనుల గురించి దేవస్థానం అధికారులు, ఆలయ అర్చకులు, స్థానికులతో చర్చించారు. మెట్ల మార్గంలో బాలాలయం నిర్మించి స్వామివారి మూలమూర్తి నమూనా విగ్రహం ఏర్పాటు చేయాలని, మూలవిరాట్‌ను కదపకుండా ఆలయాన్ని పునర్ నిర్మించాలని కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ తదితరులు కోరారు. అధ్వానంగా ఉన్న స్వామివారి పుష్కరిణి శుభ్రం చేయాలని, భక్తులకు తాగునీటి సదుపాయం కల్పించి, మరుగుదొడ్లు నిర్మించాలన్నారు. స్వామివారి సన్నిధిలో భక్తులు కల్యాణాలు చేసుకునేందుకు సరైన మండపం లేదని వివరించారు. కాటేజీలు కూడా నిర్మించాలన్నారు. మూలవిరాట్ సన్నిధికి రోడ్డు నిర్మాణం చేపట్టాలన్నారు. దాతల సహకారంతో టీటీడీ వారు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించాలని కోరారు. జేఈవో వీరబ్రహ్మం మాట్లాడుతూ గతంలో టీటీడీ ఇచ్చిన హామీలన్నింటినీ దశలవారీగా అమలు చేస్తామన్నారు. స్థానికులు సూచించిన పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు తయారుచేసి పాలకమండలి ఆమోదానికి పంపిస్తామన్నారు. ఆలయంలో మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.15 లక్షలు మంజూరయ్యాయన్నారు. ఆలయ అర్చకునికి త్వరలోనే గుర్తింపు కార్డు జారీ చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఉపమాక కొండను ఆనుకుని నిర్మించిన ఇళ్లను దేవస్థానం స్థలం కాకపోయినా 22 ఏ రిజిస్టర్లో నమోదు చేశారని స్థానికులు జేఈవో దృష్టికి తీసుకువెళ్లారు.



స్థానికుల అభిప్రాయాలు తెలుసుకుంటున్న టీటీడీ జేఈవో వీరబ్రహ్మం

నిప్పు.. కనువిప్పు

గ్యాస్ సిలిండర్ నుంచి మంటలు వచ్చినప్పుడు ఎలా అదుపు చేయాలో వివరిస్తున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది



అగ్నిమాపక వారోత్సవాలు ఫలవంతంగా ముగిశాయి. పాఠశాల విద్యార్థులకు, ఫార్మా కంపెనీల సిబ్బందికి అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. జిల్లాలో పలుచోట్ల ఫైర్ ఎక్విప్‌మెంట్‌ను ప్రదర్శించారు. అపార్ట్‌మెంట్లలో, గ్యాస్ గోడౌన్, పెట్రోల్ బంకుల్లో ప్రమాదాలను ఎలా ఎదుర్కోవాలో సోదాహరణంగా వివరించారు. -8లో



అక్షయ తృతీయ.. 'నగ'ధగలు

అమ్మకాలు పుంజుకుంటాయని వర్తకుల ఆశాభావం

మహారాణిపేట: అక్షయ తృతీయ హిందువులకు పవిత్రమైన రోజు. వైశాఖ మాసం శుక్ల పక్ష తృతీయ నాడు అక్షయ తృతీయగా జరుపుకుంటారు. అక్షయ అంటే ఎప్పటికీ తరగనిది అని అర్థం. శివపురాణం ప్రకారం.. సిరి సంపదలకు అధిపతి అయిన కుబేరుడు పరమేశ్వరుడిని ప్రార్థించగా అక్షయ తృతీయ రోజున లక్ష్మీ అనుగ్రహాన్ని ఇచ్చినట్లు చెబుతారు. అందుకే ఈ రోజున బంగారం కొంటే అంతులేని సిరి సంపదలు కలుగుతాయని భావిస్తారు. రెండేళ్ల కోవిడ్ సంబంధిత అవాంతరాలు, గతేడాది ఓ మాదిరిగా అమ్మకాలు జరగ్గా.. ఈ ఏడాది అక్షయ తృతీయపై వ్యాపారులు పూర్తి ఆశావాహ దృక్పథంతో ఉన్నారు. ఆర్థిక కార్యకలాపాలు క్రమంగా పెరుగుతున్నందున అమ్మకాలు గతం కంటే అధిగమిస్తాయని ఆశిస్తున్నారు. ఇటీవల పెరిగిన బంగారం ధరలు అడ్డంకిగా మారవచ్చని కూడా కొందరు భావిస్తున్నారు. ప్రస్తుతం 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.60,930, 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.55,850 వద్ద ఉన్న సంగతి తెలిసిందే. విశాఖ జిల్లాలో సుమారు 200 వరకు బంగారం దుకాణాలు ఉన్నాయి. జగదాంబ, జడ్జి కోర్టు, కురుపాం మార్కెట్, ద్వారకానగర్, సంపత్ వినాయనగర్ రోడ్డు, గోపాలపట్నం, మద్దిలపాలెం, కంచరపాలెం, గాజువాక, మధురవాడ తదితర ప్రాంతాల్లో కార్పొరేట్ షాపులతో పాటు స్థానిక వర్తకులు బంగారు దుకాణాలను నిర్వహిస్తున్నారు. ఈనెల 22వ తేదీన అక్షయ తృతీయ నేపథ్యంలో బంగారు దుకాణాలను అలంకరించారు. వివిధ మోడళ్లలో బంగారు ఆభరణాలు అందుబాటులో ఉంచడంతో పాటు క్యాష్‌బ్యాక్ ఆఫర్లు ప్రకటించారు. ప్రతి గ్రాముపై తగ్గింపు ధరలు, తరుగులో తగ్గింపు ఇస్తున్నారు.

కొనుగోలులో జాగ్రత్తలు అవసరం

అక్షయ తృతీయ పర్వదినం సందర్భంగా ప్రతి ఒక్కరూ బంగారం కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపిస్తారు. అయితే బంగారం కొనే సమయంలో కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు చెబుతున్నారు. ఈ నెల ఒకటో తేదీ నుంచి బంగారు వస్తువులు, ఆభరణాలు కొనుగోలుకు సంబంధించి కొత్త నిబంధనలు అమల్లోకి వచ్చాయి. బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్(బీఐఎస్) ఆరు అంకెల ఆల్ఫాన్యూమరిక్ హాల్‌మార్క్ యూనిక్ ఐడెంటిఫికేషన్ నంబర్ (హెచ్‌యూఐడీ) లేకుండా బంగారు ఆభరణాలు విక్రయించడాన్ని నిషేధించింది.



ఆశాభావంతో ఉన్నాం



అక్షయ తృతీయ కోసం అన్ని ఏర్పాట్లు చేశాం. వివిధ రకాల మోడళ్లలో బంగారు ఆభరణాలు అందుబాటులో ఉంచాం. ముఖ్యంగా మహిళల కోసం సరికొత్త డిజైన్లు షాపులో కొలువుదీరాయి. ఈ ఏడాది బంగారం అమ్మకాలు ఎక్కువగా ఉంటాయని ఆశాభావంతో ఉన్నాం.

– మంచుకొండ అప్పలరాజు శ్రీరంగ

అంతా మంచే జరుగుతుంది



అక్షయ తృతీయ అత్యంత పవిత్రమైనది. ఈ రోజున బంగారం కొనడం వల్ల ఐశ్వర్యం, అదృష్టం కలుగుతుందని నమ్మకం. మా కొనుగోలుదారుల కోసం అవసరమైన వెరైటీలతో బంగారు ఆభరణాలు సిద్ధంగా ఉంచాం. ప్రత్యేక ఆఫర్లు ప్రకటించాం.

– వైశ్యరాజు భద్రగిరిరాజు

జూనియర్ సివిల్ జడ్జిల బదిలీ

సాక్షి, విశాఖపట్నం: జిల్లాలో పలువురు జూనియర్ సివిల్ జడ్జిలను బదిలీ చేస్తూ గురువారం రాత్రి హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. చిత్తూరు జిల్లా పాకల జూనియర్ సివిల్ న్యాయస్థానం న్యాయమూర్తి కె.అనురాగ్ అలియాస్ కె.అనూష విశాఖలోని ఆరో మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు(రైల్వే న్యాయస్థానం) న్యాయమూర్తిగా బదిలీపై వస్తున్నారు. ఆ స్థానంలోనున్న న్యాయమూర్తి సిహెచ్.శ్రీనివాసబాబు కృష్ణా జిల్లా గన్నవరం ప్రధాన జూనియర్ సివిల్ న్యాయస్థానం న్యాయమూర్తిగా బదిలీ అయ్యారు. కృష్ణా జిల్లా గన్నవరం ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి వి.గంగాభవాని బదిలీపై విశాఖలోని ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా వస్తున్నారు. ఆ స్థానంలోనున్న న్యాయమూర్తి జి.సాయికృష్ణ పశ్చిమ గోదావరి జిల్లా, కొవ్వూరు రెండో అదనపు జూనియర్ సివిల్ న్యాయస్థానం న్యాయమూర్తిగా బదిలీ అయ్యారు.

క్లుప్తంగా

డిప్యూటీ సీఎంను కలసిన కొత్త ఎస్పీ



డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడుకు మొక్కను అందజేస్తున్న ఎస్పీ మురళీకృష్ణ

దేవరాపల్లి: జిల్లా ఎస్పీ కె.వి.మురళీకృష్ణ తారువ క్యాంపు కార్యాలయంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడును గురువారం సాయంత్రం మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలో శాంతిభద్రతల నిర్వహణ, నేరాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలను డిప్యూటీ సీఎంకు వివరించారు. ఆయన వెంట సీఐలు, ఎస్ఐలు ఉన్నారు.

సందేశాత్మక చిత్రాలు మరిన్ని రావాలి



పోస్టర్‌ను విడుదల చేస్తున్న గవర కార్పొరేషన్ చైర్మన్ ప్రసాద్

మునగపాక: సమాజానికి మేలు చేకూర్చే సందేశాత్మక చిత్రాలు రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఏపీ గవర కార్పొరేషన్ చైర్మన్ ప్రసాద్ అన్నారు. మునగపాకకు చెందిన వర్ధమాన దర్శకుడు డాక్టర్ కోరుకొండ గోపీకృష్ణ దర్శకత్వంలో రూపొందిన కలియుగ భగవాన్ చిత్రం పోస్టర్‌ను గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ శుక్రవారం విడుదల కానున్న ఈ చిత్రాన్ని ఆదరించాలని కోరారు. చిత్ర నిర్మాత అల్లు శ్రీరాములు, మాటల రచయిత విల్లూరి జగ్గప్పారావు, ప్రధాన పాత్రధారి కోటేశ్వరశర్మ, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

నేడు ఆస్కార్ ఫిల్మ్ ఫెస్టివల్

సీతంపేట: వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో ఈనెల 21 నుంచి 23 వరకు ఆస్కార్ అవార్డుల ఫిల్మ్ ఫెస్టివల్ ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో నిర్వహించనున్నట్లు సొసైటీ గౌరవ కార్యదర్శి ఎన్. ప్రకాశరావు తెలిపారు. 21న సాయంత్రం 6 గంటలకు ఆస్కార్ బెస్ట్ డాక్యుమెంటరీ ఫిల్మ్ 'ఎలిఫెంట్ విస్పర్స్', బెస్ట్ ఒరిజనల్ సాంగ్ 'నాటు నాటు పాట' ప్రదర్శిస్తామన్నారు.

నిప్పు.. కనువిప్పు

- అప్రమత్తతతో అగ్నిప్రమాదాలకు అడ్డుకట్ట
- వారోత్సవాల్లో 300 మందికిపైగా పరిశ్రమల సిబ్బందికి అవగాహన
- థియేటర్లు, షాపింగ్‌మాళ్లు సెల్లార్లలో మాక్ డ్రిల్
- 'సాక్షి'తో జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి లక్ష్మణ స్వామి

సాక్షి, అనకాపల్లి: అగ్గి రాజేసే వేసవి కాలంలో ఎంత అప్రమత్తంగా ఉన్నప్పటికీ చిన్నపాటి తప్పిదాలతో ప్రాణ, ఆస్తి నష్టాలు సంభవిస్తుంటాయి. ఈ నేపథ్యంలో ప్రజలను జాగరూకత చేయడానికి ఏటా అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహిస్తుంటారు. ఈ ఏడాది వారోత్సవాల్లో భాగంగా 300 మందికిపైగా పరిశ్రమల సిబ్బందికి అవగాహన కల్పించారు. థియేటర్లు, షాపింగ్‌మాళ్ల సెల్లార్లు, తదితర ప్రాంతాల్లో మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా పరిశ్రమల యాజమాన్యాలు ముందుకొస్తే ఉచిత శిక్షణ ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి లక్ష్మణస్వామి తెలిపారు.



అగ్నిమాపక అధికారి లక్ష్మణ స్వామి

గురువారం అగ్నిమాపక వారోత్సవాలు ముగిసిన సందర్భంగా పలు అంశాలపై 'సాక్షి'తో ఆయన మాట్లాడారు.

షట్‌డౌన్ సమయంలో జాగ్రత్త..!

రెండు రోజుల క్రితం పరవాడ ఫార్మాసిటీలో విష్ణు కెమికల్స్‌లో అగ్నిప్రమాదం జరిగింది. పరిశ్రమ షట్‌డౌన్ సమయంలో చిమ్నీలో పట్టే మసిలాంటి వ్యర్థాన్ని శుభ్రం చేసేటప్పుడు.. పేరుకుపోయిన మసి వెనక ఉన్న మంట, వేడి కారణంగా ప్రమాదం సంభవించింది. ఇటువంటి సమయంలో పరిశ్రమల్లో యాజమాన్యాలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి.

నిర్లక్ష్యంతో పరిశ్రమల్లో ప్రమాదాలు...

నిర్లక్ష్యం వల్ల పరిశ్రమల్లో తరుచూ అగ్నిప్రమాదాలు సంభవిస్తున్నాయి. యాజమాన్య నిర్లక్ష్యంతోపాటు ఉద్యోగులు, సిబ్బంది ఏమరుపాటు ఎక్కువగా ఉంటుంది. పరిశ్రమల్లో షిఫ్టులు మారే సమయంలో ఇంటికి త్వరగా వెళ్లిపోదామనే ఆలోచనతో ప్రమాదమని తెలిసినా.. దాన్ని సీరియస్‌గా తీసుకోకపోవడం, అప్రమత్తత లేకపోవడం వంటి కారణాలతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.

యాజమాన్యాలు ముందుకొస్తే ఉచిత శిక్షణ అందిస్తాం..

రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకూ అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహించాం. ప్రధానంగా అగ్నిప్రమాదాలు జరిగే ఫార్మా ఇండస్ట్రీస్‌లో, షాపింగ్ కాంప్లెక్స్‌లో, పెట్రోల్ బంక్స్ సమీపంలో మాక్ డ్రిల్ నిర్వహించాం. మూడు నెలల పాటు పరిశ్రమల్లో 300 ఫార్మా పరిశ్రమల ఉద్యోగులకు శిక్షణ అందించాం. ఇండస్ట్రీస్, విద్యా సంస్థలు, షాపింగ్ కాంప్లెక్స్‌లు, థియేటర్ల యాజమాన్యాలు ముందుకొస్తే మా ఫైర్ విభాగం నుంచి వారికి శిక్షణ అందించడానికి సిద్ధంగా ఉన్నాం. పల్నాడు జిల్లా సత్తెన్నపల్లి, విజయనగరం, రాజమండ్రి, కర్నూల్‌లో శిక్షణా కేంద్రాలు ఉన్నాయి.

అగ్నిమాపక కేంద్రాల ఫోన్ నంబర్లు..

అనకాపల్లి	08924-222299
సబ్బవరం	08924-248799
చోడవరం	08924-254199
యలమంచిలి	08924-231101
మాడుగుల	08924-224211
నర్సీపట్నం	08924-235101
నక్కపల్లి	08924-227801
రావికమతం	08924-226111

వారోత్సవాల్లో ఇలా..

- ఈనెల 14వ తేదీన పరవాడ, అచ్యుతాపురంలో గల పలు ఫార్మా కంపెనీల సిబ్బందికి అగ్ని ప్రమాదాలపై అవగాహన కార్యక్రమాలు
- 15న అనకాపల్లి రైల్వే స్టేషన్ రోడ్డు, రింగ్ రోడ్డు, ఎగ్జిబిషన్ రోడ్డులో ఫైర్ ఎక్విప్‌మెంట్ స్టాల్స్ ఏర్పాటు
- 16న ఎన్‌టీఆర్ స్టేడియం వద్ద పూసర్ల గీతాంజలి, శ్రీనివాస అపార్ట్‌మెంట్లలో ఫైర్ ఎక్విమెంట్ స్టాల్స్‌తో అవగాహన
- 17న దేవ్ పబ్లిక్ స్కూల్, సంయుక్త ఈఎం స్కూల్లో అగ్నిప్రమాదాల నియంత్రణపై అవగాహన కార్యక్రమం
- 18న తుమ్మపాలలో సుభద్ర హెచ్‌పీ గ్యాస్ గోడౌన్‌లో.. తోటాడ జంక్షన్‌లో గల ఐఓసీఎల్ పెట్రోల్ బంక్‌లో అవగాహన కార్యక్రమం
- 19న బెనర్జీ ఆస్పత్రిలో అవగాహన డెమో
- 20న జిల్లాలోని పలు విద్యాసంస్థల్లో అవగాహన, స్టాల్స్ ఏర్పాటు

అవగాహనతో అగ్ని ప్రమాదాల నివారణ



మాట్లాడుతున్న పరిశ్రమల శాఖ జిల్లా అధికారి శ్రీధర్, జిల్లా ఫైర్ ఆఫీసర్ లక్ష్మణస్వామి

పరిశ్రమల శాఖ జిల్లా అధికారి శ్రీధర్

సాక్షి, అనకాపల్లి: అగ్ని ప్రమాదాలపై అవగాహన పెంచుకొని, ప్రజలు వాటి నుంచి సురక్షితంగా బయటపడాలని పరిశ్రమల శాఖ జిల్లా అధికారి శ్రీధర్ అన్నారు. అగ్నిమాపక వారోత్సవాలు గురువారంతో ముగిశాయి. జిల్లా ఫైర్ ఆఫీసులో అగ్నిమాపక శాఖ జిల్లా అధికారి బి.లక్ష్మణస్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి శ్రీధర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పలు అగ్నిప్రమాదాల నుంచి ఎలా తమని తాము రక్షించుకోవాలి...అనే అంశంపై విద్యార్థులకు ప్రదర్శన నిర్వహించారు. వారోత్సవాల సందర్భంగా పాఠశాల విద్యార్థులకు, ఫార్మా పరిశ్రమల ఉద్యోగులకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

తప్పిపోయిన బాలుడు..తల్లిదండ్రుల చెంతకు

24 గంటల్లోనే కేసు ఛేదించిన పోలీసులు

దేవరాపల్లి: మండలంలోని తెనుగుపూడి గ్రామానికి చెందిన బాలుడు షేక్ అబ్దుల్ కలాం (17) అదృశ్యం కేసును 24 గంటలు గడవక ముందే ఛేధించి పోలీసులు పలువురి ప్రశంసలు అందుకున్నారు. తప్పిపోయిన బాలుడు అబ్దుల్ కలాంను పోలీసులు గురువారం తల్లిదండ్రులకు అప్పగించారు. తమ కుమారుడు అదృశ్యమయ్యాడని తండ్రి షేక్ నూర్ సాహెబ్ బుధవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ డి. నాగేంద్ర కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. 24 గంటల గడవక ముందే బాలుడిని పట్టుకొని తల్లిదండ్రుల చెంతకు చేర్చారు. బాలుడి ఆచూకీ కోసం గాజువాక, విశాఖపట్నం ప్రాంతాలలో సిబ్బందితో వేర్వేరుగా గాలించారు. విశాఖపట్నం జగదాంబ సెంటర్ ఉన్నట్లు గుర్తించి పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చారు. ఈ మేరకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ నాగేంద్ర సమక్షంలో తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ సందర్భంగా 24 గంటలు గడవక ముందే అదృశ్యం కేసును ఛేధించి బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించిన ఎస్ఐ నాగేంద్రను సీఐ ఎస్.తాతారావు, బాధిత కుటుంబ సభ్యులు అభినందించారు.



అబ్దుల్ కలాంను తండ్రికి అప్పగిస్తున్న పోలీసులు

పాముకాటుతో గీత కార్మికుడు మృతి

కె.కోటపాడు: గవరపాలెం గ్రామానికి చెందిన కల్లు గీత కార్మికుడు సిమ్మ దేముడు(57) పాము కాటుకు గురయ్యి బుధవారం రాత్రి మృతిచెందాడు. బుధవారం సాయంత్రం దేముడు కల్లు గీసేందుకు చెట్లు ఎక్కేందుకు వెళ్తున్న సమయంలో పాముకాటుకు గురయ్యాడు. దీంతో ఆయనను కుటుంబ సభ్యులు కె.కోటపాడు సీహెచ్‌సీకి తీసుకువెళ్ళారు. వైద్యం అందుతున్న సమయంలో దేముడు ఆరోగ్య పరిస్థితి విషమించి మృతిచెందాడు. దీంతో గురువారం గ్రామంలో అంత్యక్రియలను నిర్వహించారు. జెడ్పీటీసీ ఈర్లె అనురాధ, ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్, ఎంపీటీసీ చీపురపల్లి అచ్చిబాబు, మాజీ సర్పంచ్ నెక్కల పెంటయ్యలు మృతదేహానికి నివాళులు అర్పించి, అతని కుటుంబ సభ్యులను ఓదార్చారు.

కార్గో సర్వీస్ ద్వారా రూ.1.20 కోట్లు

ఏపీఎస్ ఆర్టీసీ ఎండీ ద్వారకాతిరుమలరావు



పద్మావతికి ప్రశంసాపత్రం అందిస్తున్న ద్వారకాతిరుమలరావు

అనకాపల్లిటౌన్: ఈ ఏడాది ఏపీఎస్ ఆర్టీసీ కార్గో సర్వీస్ ద్వారా రూ.1.20 కోట్లు సమకూరిందని ఏపీఎస్ ఆర్టీసీ ఎండీ సీహెచ్. ద్వారకాతిరుమలరావు అన్నారు. అమరావతిలో తన కార్యాలయంలో ఆయన గురువారం మాట్లాడారు. కార్గో సర్వీస్ ద్వారా విజయనగరం జోన్‌లో అనకాపల్లి జిల్లా ప్రథమస్థానంలో నిలవగా రాష్ట్రంలో ద్వితీయ స్థానాన్ని దక్కించుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజా రవాణాశాఖాధికారిణి కె.పద్మావతికి ప్రశంసాపత్రం అందజేసి అభినందించారు.

రామాలయ భూ వివాదంపై విచారణ



జిల్లా దేవదాయ శాఖ అధికారి శ్రీధర్‌కు వినతి పత్రం అందిస్తున్న ఆలయ ప్రతినిధులు

కొత్తకోట: మండలంలోని తాళ్లపాలెం రామాలయంలో ధూప దీప నైవేద్యాలకు బహుమతిగా దాత ఇచ్చిన భూమి వివాదంపై దేవదాయ శాఖ జిల్లా అధికారి ఎం.శ్రీధర్ గురువారం విచారణ జరిపారు. ఆ భూమి ఎలా దఖలు పడిందనే విషయమై ఆలయ కమిటీ ప్రతినిధులు, పెద్దలను విచారించారు. తాళ్లపాలెంకు చెందిన రామాలయానికి అదే గ్రామానికి చెందిన కాపుగంటి వెంకటరమణ తనకు జమాదులపాలెం గ్రామ సర్వే నెంబర్ 653-1లో ఉన్న 2.37 ఎకరాల భూమిని 1974లో బహుమతిగా రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చారని వివరించారు. అందుకు సంబంధించి డాక్యుమెంట్లు, ఆధారాలు మొదట లభ్యం కాకపోవడంతో ప్రభుత్వ భూమిగా అదే భూమిలో ఇళ్ల పట్టాలివ్వడానికి మండల రెవెన్యూ అధికారులు 2021లో ప్రతిపాదించారన్నారు. దానికి అభ్యంతరం తెలియజేస్తూ రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకపోయిందన్నారు. ఈ నేపథ్యంలో భూమి రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు కూడా లభ్యం కావడంతో ముఖ్యమంత్రి, జిల్లా కలెక్టర్లకు ఈ వ్యవహారంపై విచారణకు ఫిర్యాదు చేశామని వివరించారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు వచ్చిన శ్రీధర్ విచారణ జరిపారు. అలాగే జమాదులపాలెంలో ఉన్న రామాలయానికి చెందిన భూమిని కూడా పరిశీలించారు. విచారణ నివేదికను కలెక్టర్‌కు నివేదిస్తామన్నారు. తాళ్లపాలెం మాజీ మునసబు చిన్ని సన్యాసినాయుడు, మాజీ సర్పంచ్ చిన్ని వల్లభ నారాయణ రావు, ఆలయ ధర్మకర్త చిన్ని కోటేశ్వరరావు, స్థానిక నాయకులు గల్లా రాజు, చిన్ని రాజీవ్, చిన్ని జనార్ధన్, కర్రి గోవింద, శ్రీకాంత్ వంతులు, ఉల్లింగల రమేష్, శంకరరావు, ఎ. అప్పారావు పాల్గొన్నారు.

పూర్ణామార్కెట్ ఆశీల వేలం రూ.62.56లక్షలు

జగదాంబ: ఎట్టకేలకు పూర్ణామార్కెట్ ఆశీల వేలం పాట ఖరారైంది. ఆరుసార్లు వాయిదా పడుతూ వచ్చిన వేలం పాట.. గురువారం జోన్-4 కార్యాలయంలో జోనల్ కమిషనర్ శివప్రసాద్ మరోసారి నిర్వహించారు. కాంట్రాక్టర్ సీహెచ్ కిరణ్‌కుమార్ 2023-24 సంవత్సరానికి రూ.62.56 లక్షలకు పాటను దక్కించుకున్నారు. అలాగే రామకృష్ణ రైతుబజార్‌ను కాంట్రాక్టర్ జి.గణేష్ రూ.15.50 లక్షలకు వేలం పాట పాడారు.

రైతు బాంధవుడు తులసీరావు

- డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు
- డెయిరీ నిధులతో పలు అభివృద్ధి పనులు: ఆనంద్‌కుమార్

చీడికాడ: దివంగత మహానేత వైఎస్సార్ మాదిరిగానే దివంగత విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి తులసీరావు రైతుల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. గురువారం పెదగోగడలో విశాఖ డెయిరీ నూతన చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్‌తో కలిసి కొత్తగా నిర్మించిన డైరీ పాలసేకరణ కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో బూడి మాట్లాడుతూ విశాఖ డెయిరీని స్థాపించి అంచలంచెలుగా ఎదిగి, రైత కుటుంబాలకు, కార్మికులకు విద్య, వైద్యం అందించి గొప్ప ఖ్యాతి గడించారని తులసీరావు సేవల్ని స్మరించుకున్నారు. తులసీరావు మన మధ్యన లేకపోయినా ఆయన నిర్మించిన రైతు సేతులు కట్టువాని అగ్రహారం బ్రిడ్జి, పోతనపూడి-వీరవిల్లి అగ్రహారం బ్రిడ్జి గుర్తుండిపోతాయన్నారు. తురువోలు నుంచి పెదగోగాడ మీదుగా చెట్టుపల్లి, చుక్కపల్లి గ్రామాల వరకు సాగునీటి కాలువ, కోనాం హైలెవిల్ కాలువలో తురువోలు నుంచి వాకపల్లి వరకు నిలిచిపోయిన సిమెంట్ లైనింగ్ పనులను డెయిరీ ద్వారా పూర్తి చెయ్యాలని డెయిరీ చైర్మన్ ఆనంద్‌కుమార్‌ను కోరారు. అనంతరం ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం ఆలోచిస్తున్నానంటే అది సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వలనేనన్నారు. తండ్రి ఆశయాలను ముందుకు తీసుకెళ్లడంలో తనకు సీఎం జగనే ఆదర్శమన్నారు. ప్రజలకు ఏదో రూపంలో సాయం చెయ్యాలన్న తపన డిప్యూటీ సీఎంలో కబడుతోందని, ఆయన కోరిన రెండు పనులను పూర్తి చేస్తామని ప్రకటించారు. వారం రోజుల్లో సాగునీటి కాలువ పనులు ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కురచా జయమ్మ, జెడ్పీటీసీ లాలం శారదా జానకిరాం, డెయిరీ డైరెక్టర్ శీరంరెడ్డి సూర్యనారాయణ, వైఎస్సార్‌సీపీ జిల్లా రైతువిభాగం అధ్యక్షుడు యర్రా అప్పారావు, సర్పంచ్ పైల అచ్చియ్యమ్మ, ఎంపీటీసీ కొల్లి నాగమణి తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ సేవలపై విస్తృత అవగాహన

దేవరాపల్లి, పెదనందిపల్లి ఆధార్ ప్రత్యేక శిబిరాల్లో డీఎల్‌డీవో మంజులవాణి తనిఖీ

దేవరాపల్లి: సచివాలయాల్లో ఏర్పాటు చేసిన ఆధార్ ప్రత్యేక శిబిరాలపై గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని అనకాపల్లి డీఎల్‌డీవో ఎస్.మంజులవాణి సూచించారు. ఈ మేరకు దేవరాపల్లి, పెదనందిపల్లి సచివాలయాల్లోని ఆధార్ కేంద్రాలను ఆమె సందర్శించారు. అక్కడ అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో 104 ఆధార్ ప్రత్యేక శిబిరాలు మంజూరు చేయగా, ప్రస్తుతం 60 కేంద్రాలు పనిచేస్తున్నాయన్నారు. మిగిలిన వాటికి లాగిన్ ఐడీ, పాస్‌వర్డ్ రావాల్సి ఉందన్నారు. ఈ కేంద్రాల ద్వారా రోజుకు 1300 నుంచి 1400 వరకు సేవలందిస్తున్నామన్నారు. అడ్రస్, జిల్లా పేర్లు మార్పు చేసుకోవచ్చునని సూచించారు. గర్భిణుల సంఖ్యను గుర్తించడంలో ఆరోగ్యశాఖ, ఐసీడీఎస్ సిబ్బంది మధ్య తేడా వస్తుందని, ఈ నేపథ్యంలోనే సచివాలయం ద్వారా సర్వే చేసి వారి ఆధార్, ఫోన్ నెంబర్లకు సేకరిస్తున్నామన్నారు. అంతకు ముందు నాగయ్యపేట, చింతలపూడి సచివాలయాలను సందర్శించారు. చింతలపూడిలో నెట్ సౌకర్యం లేని కారణంగా బయోమెట్రిక్ వేయలేకపోతున్నారని, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఎంపీడీవో సిహెచ్. సుబ్బలక్ష్మి, ఈవోపీఆర్డీ కె. ఉషశ్రీ పాల్గొన్నారు.



దేవరాపల్లిలో ఆధార్ ప్రత్యేక శిబిరాన్ని పరిశీలిస్తున్న డీఎల్‌డీవో మంజులవాణి

ఇంటి నుంచి వెళ్లగొట్టిందని కోడలిపై ఫిర్యాదు



పూరిపాకలో ఉంటోన్న దేముడమ్మ

రావికమతం: తన ఇంటిని ఆక్రమించుకోవడమే కాక తనను ఇంటి నుంచి వెళ్లగొట్టిందంటూ బూరుగుపాలెం గ్రామానికి చెందిన నమ్మి దేముడమ్మ ఆమె కోడలిపై తహసీల్దార్‌కు గురువారం ఫిర్యాదు చేసింది. దేముడమ్మ భర్త కొన్నేళ్ల క్రితం మృతి చెందాడు. గతంలో ఆమెకు, ఆమె కుమార్తెకు ప్రభుత్వం గృహాలు మంజూరు చేసింది. ఇరువురు రెండు గదులు నిర్మించుకున్నారు. అయితే ఒక గదిలో కుమారుడు అప్పలనాయుడు ఆకస్మికంగా మృతి చెందడంతో కోడలితో కలిసి అదే ఇంటిలో ఉంటున్నామని, ఇటీవల తన కోడలు నాగమణి ఆ ఇంటికి తాళం వేసి తనను ఇంటి నుంచి వెళ్లగొట్టిందని ఫిర్యాదులో పేర్కొంది. ఎండలు మండి పోతున్నాయి పాకలో ఉండలేక పోతున్నాను.. వడదెబ్బ తగిలి ఎప్పుడు ఏమవుతుందోనని ఆందోళన చెందుతున్నాను.. అధికారులు దయ చూపి తనకు న్యాయం చేయాలని వేడుకుంది. గ్రామానికి వచ్చి విచారణ చేసి న్యాయం చేస్తామని తహసీల్దార్ మహేశ్వరరావు ఆమెకు హామీ ఇచ్చారు.

వసతి గృహాలకు మినరల్ వాటర్

రోజూ కనీసం 8 గ్లాసుల శుద్ధజలం మనిషి ఆరోగ్యానికి మంచిది. లేకుంటే అపరిశుభ్ర నీటి ద్వారా సంక్రమించే రోగాలెన్నో. బడుగు, బలహీన వర్గాల కోసం నిర్వహించే వసతి గృహాల్లో బోర్లు, బావులు, కుళాయిల నీరే ఇన్నాళ్లూ దిక్కు. ఈ నీటినే మరిగించి తాగేందుకు ఇక్కట్లు పడేవారు. తాజాగా ప్రభుత్వం వసతి గృహాల్లో ఆర్వో ప్లాంట్ల ఏర్పాటుపై దృష్టి పెట్టింది. ఎంపీపీ నిధులతో తాజాగా మూడు చోట్ల ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేసి, విద్యార్థుల ఆరోగ్యానికి అధికారులు భరోసానిచ్చారు.



తుమ్మపాల ఎస్సీ బాలికల వసతి గృహంలో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్

- ఎంపీపీ నిధులతో ఆర్వో ప్లాంట్ల ఏర్పాటు
- తొలి విడతలో మూడు వసతి గృహాలు
- సీఎస్సార్ నిధులతో మరి కొన్ని చోట్ల కసరత్తు

అనకాపల్లిటౌన్ : పట్టణ, గ్రామీణ పరిధిలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ వసతి గృహాల్లో పరిశుభ్రమైన తాగునీటి సరఫరాకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. మారుతున్న కాలానికి అనుగుణంగా, విద్యార్థులు రోగాలబారిన పడకుండా మినరల్ వాటర్ అందిస్తున్నారు. ఇందుకు ఆయా వసతి గృహాల్లో ఆర్వో ప్లాంట్లను ఏర్పాటు చేస్తున్నారు. ప్రభుత్వ నిధులతో పాటు, వివిధ సంస్థల కార్పొరేట్ సామాజిక బాధ్యత(సీఎస్ఆర్) నిధులను కూడా జిల్లా యంత్రాంగం దీనికి కేటాయిస్తోంది.

ఎక్కువ నీరు తీసుకోవాలి.. కానీ..!

స్కూళ్లు, కాలేజీల్లో ఈ మధ్యన వీలైనంత ఎక్కువగా నీళ్లు తాగేందుకు ప్రత్యేక పీరియడ్లు కూడా కేటాయిస్తున్నారు. ఎంత ఎక్కువగా నీళ్లు తాగితే ఆరోగ్యం అంత బాగుంటుందని వైద్యులు చెప్తున్నారు. అయితే గత ప్రభుత్వాల నిర్లక్ష్యం, నిర్లిప్తత కారణంగా చాలా వసతి గృహాల్లో బోర్లు, బావులు, కుళాయిలే ఆధారం. భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ, సెప్టిక్ ట్యాంక్‌ల కాలంలో ఈ నీరు చాలా చోట్ల కలుషితమవుతోంది. దీంతో రోగాలు వ్యాపిస్తున్నాయి. ఈ నీరు తాగాలంటే చాలా మందికి భయం. దీన్ని దృష్టిలో పెట్టుకుని ప్రస్తుత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అన్ని వసతి గృహాల్లో వీలైనంత మేరకు మినరల్ వాటర్‌ను అందించేలా చర్యలు చేపట్టింది. అందులో భాగంగానే అనకాపల్లి పట్టణంలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ వసతి గృహాల్లోను, మండలంలో తుమ్మపాల పంచాయతీ పరిధిలో బాలికల వసతి గృహాల్లో విద్యార్థులకు పరిశుభ్రమైన తాగునీరు అందించేందుకు ఆర్వో ప్లాంట్లను ఏర్పాటు చేసింది.

రూ.10 లక్షలతో మూడు ఆర్వో ప్లాంట్లు

ఎంపీపీ నిధుల నుంచి మండలంలోని తుమ్మపాల పంచాయతీ పరిధిలో చిన్నబాబు కాలనీలోని ఎస్సీ హాస్టల్లో ఇంటర్ నుంచి పీజీ వరకు సుమారు 140 మంది విద్యార్థులు ఉంటున్నారు. కుళాయిల ద్వారా వచ్చే నీటిని వేడిచేసుకుని తాగేవారు. ఎంపీపీ నిధుల నుంచి రూ.5 లక్షలతో ఇక్కడ ఒక ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేశారు. పట్టణంలోని అంజయ్యకాలనీలో బీసీ, ఎస్సీ-ఎస్టీ వసతి గృహాల్లో ఒక్కో దానికి రూ.2.50 లక్షల చొప్పున రెండు ప్లాంట్లు ఏర్పాటు చేశారు. దీంతో ఇక్కడున్న 5 నుంచి 10వ తరగతి విద్యార్థులు పరిశుభ్రమైన నీటిని తాగుతున్నారు.

తాగునీటి కష్టాలకు చెక్

కుళాయిలు ద్వారా వచ్చే నీరే ఇన్నాళ్లూ మాకు ఆధారం. వర్షా కాలంలో శారదా నదిలో బురద నీటితో, కుళాయిల నీరు కూడా చాలా వరకు రంగు మారిపోయేది. బాగా మరిగించి తాగేందుకు ఇబ్బంది పడేవాళ్లం. ఎంపీపీ నిధులతో ఆర్వో ప్లాంట్‌ను నిర్మించారు. దీంతో ఇపుడు మేం కూడా మినరల్ వాటరే తాగుతున్నాం.

– ప్రసన్నలక్ష్మి, డిగ్రీ విద్యార్థిని

మినరల్ వాటర్ బాగుంది



ఇన్నాళ్లూ బోరు, కుళాయి ద్వారా వచ్చే నీటిని మాత్రమే తాగేవాళ్లం. టేస్ట్ కూడా పెద్దగా ఉండేది కాదు. దీంతో ఎక్కువగా నీళ్లు తాగేందుకు ఇంట్రస్ట్ ఉండేది కాదు. తరచూ చిన్నచిన్న రోగాల బారిన పడేవాళ్లం. ప్రస్తుతం హాస్టల్లో మాకు అవసరమైనంత మినరల్ వాటర్‌ను ఆర్వో ప్లాంట్ ద్వారా అందిస్తున్నారు. ఆరోగ్యంపై ధీమా పెరిగింది.

– పి.సురేష్, 9వ తరగతి

విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ



విద్యార్థుల ఆరోగ్యం దృష్ట్యా వసతి గృహాల్లో మినరల్‌వాటర్ ఏర్పాటు మంచి నిర్ణయం. ఎంపీపీ నిధుల నుంచి తొలిసారిగా ఆర్వో ప్లాంట్లను నెలకొల్పడం అభినందనీయం. ప్రభుత్వం వసతి గృహాలను మరింతగా అభివృద్ధి చేస్తోంది. దీంతోపాటు పరిశ్రమల సీఎస్ఆర్ నిధుల నుంచి వసతి గృహాలను అభివృద్ధి చేసేందుకు కలెక్టర్, మంత్రి చర్యలు తీసుకోవడం శుభపరిణామం.

– ఎస్.సత్యనారాయణ, వార్డెన్, బీసీ హాస్టల్, గాంధీనగరం

క్లుప్తంగా

పడమటమ్మ సన్నిధిలో హోమాలు



విసన్నపేట పడమటమ్మ ఆలయం వద్ద నిర్వహిస్తున్న హోమం

కశింకోట : మండలంలోని విసన్నపేట వద్ద వేంచేసిన పడమటమ్మ ఆలయంలో విశ్వశాంతి, వ్యక్తిగత శాంతి కోసం గురువారం హోమాలు నిర్వహించారు. గురుస్వామి పి.సాంబమూర్తి ఆధ్వర్యంలో పలు ప్రాంతాల నుంచి భక్తులు, ప్రజలు పాల్గొని శాస్త్రోక్తంగా హోమాలు జరిపారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని, పూజలు చేశారు.

వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత



బీమా సాయాన్ని కళావతికి అందిస్తున్న సర్పంచ్ మంత్రి జయరజని, కార్యదర్శి రమేష్

కశింకోట : స్థానిక పంచాయతీ కార్యాలయంలో వైఎస్సార్ బీమా కింద తక్షణ సాయంగా బాధిత కుటుంబానికి గురువారం రూ.10 వేలు అందించారు. ఇటీవల పూడి ఆనంద్ మృతి చెందాడు. మృతునికి వైఎస్సార్ బీమా వర్తించడంతో, అతని భార్య కళావతికి తక్షణ సాయాన్ని సర్పంచ్ మంత్రి జయరజని, పంచాయతీ కార్యదర్శి ఎస్.రమేష్ అందించారు. కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఎన్టీయార్ ఆస్పత్రిని సందర్శించిన అభివృద్ధి కమిటీ



శ్రీనివాసరావుతో మాట్లాడుతున్న రామ్మూర్తి

అనకాపల్లిటౌన్ : స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయ నేత్ర విభాగాన్ని ఆస్పత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ జి.రామ్మూర్తి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేత్ర వైద్యుడు శ్రీనివాసరావును శస్త్రచికిత్సలపై ఆరా తీశారు. కంటి సంబంధిత శస్త్రచికిత్సలకు అవసరమైన అన్ని సదుపాయాలు ఉన్నాయని వైద్యుడు పేర్కొన్నారు.

వడదెబ్బ నివారణపై అవగాహన



మాట్లాడుతున్న వైద్యాధికారి లావణ్య

అనకాపల్లిటౌన్ : వేసవిలో వడదెబ్బ నివారణ చర్యలపై ప్రభుత్వ ఆయుష్ వైద్యాధికారి కె.లావణ్య వివరించారు. స్థానిక భీమునిగుమ్మం అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన ఆయుష్ వైద్య శిబిరానికి హాజరై మాట్లాడారు. శరీర ఉష్ణోగ్రతల తీవ్రత వలన వ్యాపించే అనారోగ్య సమస్యలు, పరిష్కార మార్గాలను తెలిపారు. కార్యక్రమంలో ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, చిన్నారులు పాల్గొన్నారు.

అనకాపల్లి సినిమాలు

రుద్రుడు	రాజా
కలియుగ భగవాన్	సత్యనారాయణ స్క్రీన్-1
ఈవిల్ డెడ్ రైజ్	సత్యనారాయణ స్క్రీన్-2
రావణాసుర	షిర్డీసాయి
విరుపాక్ష	పర్తిసాయి
విడుదల(పార్ట్-1)	వెంకటేశ్వర
రావణాసుర	శ్రీసత్య
శాకుంతలం	రామచంద్ర

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు గురువారం 1,755 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	--	--
మొదటి రకం	3,840	4,170
రెండో రకం	3,430	3,900
మూడో రకం	3,220	3,420

ఎండలు బాబోయ్ ఎండలు



కశింకోటలో ఎండ తీవ్రతతో బోసిపోయిన పంచాయతీ ప్రధాన రహదారి

కశింకోట : కశింకోటలో గురువారం వేసవి ఎండలు, వడగాల్పులతో ప్రజలు సతమతమయ్యారు. చాలా మంది ఇళ్లకే పరిమితమయ్యారు. గత కొంత కాలంగా ఉష్ణోగ్రతలతోపాటు, వెచ్చని గాలుల తీవ్రత పెరుగుతోంది. దీంతో అత్యవసర పనులు ఉన్న వారు తప్ప మిగిలిన వారు బయటకు వెళ్లడానికి సాహసించలేని పరిస్థితి. వారపు సంతలో కొనుగోళ్లు ఉదయం 11 వరకు అంతంత మాత్రంగానే సాగాయి. ఎండలు మండిపోతుండటంతో కొనుగోలుదారులు రాక దుకాణాలు వెల వెలబోయాయి. సంత జరిగే ప్రాంతం, ప్రధాన పంచాయతీ రహదారి బోసిపోయాయి. సాయంత్రం వాతావరణం కాస్త చల్లబడిన తర్వాత కొనుగోలుదారులు రావడంతో సంత కళకళలాడింది.

23న అంబేడ్కర్ గురుకులం ప్రవేశపరీక్ష



ప్రిన్సిపాల్ మల్ల మాణిక్యం

కశింకోట : మండలంలోని తాళ్లపాలెంలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులం(బాలికలు)లో ఐదవ తరగతి, ఇంటర్మీడియట్‌లో చేరడానికి ఈ నెల 23న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ మల్ల మాణిక్యం తెలిపారు. ఆ రోజు ఉదయం 10 నుంచి 12 గంటల వరకు 5వ తరగతికి, అదే రోజు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఇంటర్మీడియట్‌కు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామన్నారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు ముందుగా తాము దరఖాస్తు చేసుకున్న www.apgpcet.apcfss.in వెబ్‌సైట్ ద్వారా హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. పరీక్షకు వచ్చేటపుడు హాల్‌టికెట్‌తో పాటు ఆధార్ కార్డు ఒరిజినల్ తమ వెంట తీసుకు రావాలన్నారు. ఎవరి హాల్ టిక్కెట్‌లో నైనా ఫోటో ముద్రించి లేని ఎడల, తమ వెంట పాస్ పోర్టు సైజ్ ఫోటోను తెచ్చుకోవాలన్నారు. నిర్దేశిత సమయానికి ముందే పరీక్షకు హాజరుకావాల్సిందిగా సూచించారు.

పాలిటెక్నిక్, ఏపీఆర్జేసీలకు ఉచిత శిక్షణ



డీఎస్పీ మహేష్, రమణమూర్తిలను జ్ఞాపికతో సత్కరిస్తున్న నారాయణరావు, సంస్థ సభ్యులు

అనకాపల్లిటౌన్ : పదోతరగతి పరీక్షలు రాసిన విద్యార్థులు పౌర్ణమి సేవా సంస్థ అందిస్తున్న పాలిటెక్నిక్, ఏపీఆర్జేసీ ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జి డీఎస్పీ మళ్ల మహేష్ కోరారు. స్థానిక కల్యాణి నర్సింగ్‌హోం మేడపై ఉన్న సంస్థ కార్యాలయంలో గురువారం ఆయనతో పాటు రైటర్స్ అకాడమీ వ్యవస్థాపకుడు వీవీ రమణమూర్తి ఈ శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మహేష్ మాట్లాడుతూ శిక్షణా తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని, మంచి ర్యాంకులు సాధించాలని సూచించారు. వీవీ రమణమూర్తి మాట్లాడుతూ చెడు వ్యసనాలకు దూరంగా చదువుపై దృష్టి కేంద్రీకరించి విద్యార్థులు ఉన్నతస్థాయిని అధిరోహించాలని అభిలషించారు. పౌర్ణమి సంస్థ అధ్యక్షుడు నారాయణరావు మాట్లాడుతూ 13 ఏళ్లుగా తమ సంస్థ ఆధ్వర్యంలో ఈ శిక్షణా తరగతులు జరుగుతున్నాయన్నారు. అంతకుముందు డీఎస్పీ మళ్ల మహేష్, వీవీ రమణమూర్తిలను జ్ఞాపికతో సత్కరించారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శులు బుద్ధ సోమేశ్వరరావు, బొడ్డేడ కాశీ, సభ్యులు ఎం.నాగేశ్వరరావు, పి.ఆది కోటేశ్వరరావు, ఏఎస్ నాయుడు, కర్రి త్రినాథ్, ఆడారి శివాజీ, బి.రమణాజీ, పెతకంశెట్టి రాము, ఆళ్ల మాధవ్ పాల్గొన్నారు.

ఘనంగా గంధం అమావాస్య పూజలు



కశింకోటలోని నూకాంబిక అమ్మ వారికి పూజలు



దర్శనానికి నిరీక్షిస్తున్న భక్తులు

కశింకోట : స్థానిక నూకాంబిక ఆలయం గురువారం గంధం అమావాస్య(నెల పండగ) సందర్భంగా భక్తులతో కిటకిటలాడింది. నియోజకవర్గ గ్రామాల నుంచి భక్తులు ఎక్కువ సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. అరటి గెలలు, చీరలు, రవికెలు, తలనీలాల రూపంలో మొక్కుబడులు సమర్పించుకున్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు అమ్మవారిని దర్శించుకుని, పూజలు చేశారు. మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు వేగి గోపీకృష్ణ, పలువురు టీడీపీ నాయకులు అమ్మవారిని దర్శించుకున్నారు. తొలుత ధర్మకర్తలు వేగి శివగణేష్, వేగి రామరాజు తదితరుల ఆధ్వర్యంలో అ మ్మవారిని పూలమాలలు, అభరణాలతో అలంకరించి ప్రత్యే పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. రాత్రి వరకు భక్తుల తాకిడి కొనసాగింది. ఉగ్గినపాలెం, తాళ్లపాలెం, నూతలగుంటపాలెం, నరసింగబిల్లి తదితర గ్రామాల్లోని నూకాంబిక అమ్మ వారి ఆలయాల్లోనూ భక్తులు భారీగా తరలివచ్చి, అమ్మవార్లను దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు.

23న లక్ష్మీనృసింహుని చందనోత్సవం



కశింకోటలో వెలసిన లక్ష్మీనృసింహస్వామి

కశింకోట : స్థానిక పురాతన లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో ఈ నెల 23న అక్షయ తృతీయ పురస్కరించుకుని వార్షిక చందనోత్సవం నిర్వహించనున్నట్టు ఆలయ అర్చకుడు అత్తిలి కోదండపాణి గురువారం తెలిపారు. ఆ రోజు తెల్లవారుజామున 4 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు భక్తులకు స్వామి నిజ రూప దర్శనం ఉంటుందన్నారు. ఈ సమయంలో పంచామృతాలు, పండ్లరసాలు తదితర అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరపనున్నట్టు పేర్కొన్నారు. అనంతరం స్వామికి చందనాన్ని పూసి పూజించనున్నట్టు వెల్లడించారు. భక్తులంతా పాల్గొని, స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించాల్సిందిగా కోరారు.

వీఎంఆర్‌డీఏ బోరు పనుల అడ్డగింత



బోరు తవ్వకం పనులను అడ్డుకుంటున్న దళిత, గిరిజన రైతులు

అనకాపల్లి రూరల్ : వీఎంఆర్‌డీఏ లాండ్ పూలింగ్‌లో భూములు కోల్పోయిన తమకు వెంటనే రెసిడెన్షియల్ ప్లాట్లు అప్పగించాలని, అప్పటి వరకూ పనులు సాగనిచ్చేది లేదని మామిడిపాలెం దళిత, గిరిజన రైతులు హెచ్చరించారు. ఈ మేరకు గురువారం బోరు తవ్వకం పనులను అడ్డుకున్నారు. లాండ్ పూలింగ్‌లో భూములు కోల్పోయిన తమకు రెసిడెన్షియల్ ప్లాట్స్ ఇస్తామని నాలుగేళ్ల కిందట జీవో నెం.72 జారీ చేశారని రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి కోన మోహన్‌రావు చెప్పారు. కార్యక్రమంలో బత్తిన కృష్ణ, కె.కొండమ్మ, వి.నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.

తాకాశివీధి నూకాంబిక అమ్మవారి నెలపండగ



అన్నసమారాధనను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ జాజుల ప్రసన్నలక్ష్మి

అనకాపల్లిటౌన్ : స్థానిక తాకాశివీధి నూకాంబిక ఆలయంలో గురువారం నెల పండగ పురస్కరించుకుని అర్చకులు అమ్మవారిని ప్రత్యేకంగా అలకరించి కుంకుమ పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తుల రాకతో ఆలయం కిటకిటలాడింది. మధ్యాహ్నం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ అన్నసమారాధనను 83వ వార్డు కార్పొరేటర్ జాజుల ప్రసన్నలక్ష్మి, ఆలయ చైర్మన్ తాకాశి రాజేష్‌లు ప్రారంభించారు. పెద్ద ఎత్తున భక్తులు హాజరై అమ్మవారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు తాకాశి సూర్యారావు, తాకాశి కొండలరావు, బేతి ఈశ్వరరావు, విస్సు, తాకాశి సత్యందొర, గంగుపాం మహేష్‌దొర, కారుకుండి కన్నా పాల్గొన్నారు.

వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శం



మహిళలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న రత్నాకర్



గుమ్మడివారివీధిలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు

- ఇంటింటా 'జగనన్నే మా భవిష్యత్తు'

అనకాపల్లిటౌన్ : వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శమని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ పరిశీలకులు దాడి రత్నాకర్ అన్నారు. స్థానిక గవరపాలెం 80వ వార్డు పరిధిలో గురువారం మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీశారు. ప్రభుత్వం నుంచి నేరుగా సంక్షేమ పథకాలు పేదల ముంగిటకు చేరడంతో, ప్రభుత్వంపై ప్రజలకు మరింత భరోసా ఏర్పడిందన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రజా మద్దతు పుస్తకంలో ఉన్న ప్రశ్నలకు సమాధానాలు అడిగి, రాసుకున్నారు. వారి అనుమతితో జగన్ స్టిక్కర్లను వారింటి గోడలకు అతికించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పార్టీని గెలిపించి, మరోసారి జగన్‌ను సీఎంగా చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ కొణతాల నీలిమ, ఇన్‌చార్జి భాస్కరరావు, గృహసారథులు, కన్వీనర్లు, పార్టీ నేతలు పాల్గొన్నారు.

కశింకోట : మండలంలోని తాళ్లపాలెం గుమ్మడివారి వీధిలో గురువారం రాత్రి జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని సచివాలయ కన్వీనర్లు లగిశెట్టి గణేష్, గుమ్మడి నారాయణరావు నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు వివరించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలపై రూపొందించిన బ్రోచర్లను పంపిణీ చేశారు. మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లను ఇళ్లకు అతికించారు. కార్యక్రమంలో గృహసారథులు పాల్గొన్నారు.

నాలుగు రోజులు విద్యుత్ అంతరాయం

కశింకోట : మండలంలోని నరసింగబిల్లి, కన్నూరుపాలెం సబ్ స్టేషన్ల పరిధిలో విద్యుత్ లైన్లకు అడ్డంగా ఉన్న చెట్లు, కొమ్మలు తొలగింపు కార్యక్రమం(జంగిల్ క్లియరెన్స్) కోసం శుక్రవారం నుంచి వరుసగా నాలుగు రోజులపాటు ఉదయం 6.30 నుంచి 10.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు ఈపీడీసీఎల్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బీఎల్‌పీ నాయుడు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. దీంతో నరసింగబిల్లి సబ్ స్టేషన్ పరిధిలోని నరసింగబిల్లి, సోమవరం, గొబ్బూరు, వై.తుని, చిన ఏనుగుతుని, నూతలగుంటపాలెం, గొల్లుగుంట, తాళ్లపాలెం, పరవాడపాలెం, ఉగ్గినపాలెం, జమాదులపాలెం గ్రామాల్లోను, కన్నూరుపాలెం సబ్ స్టేషన్ పరిధిలోని తీడ, జి.భీమవరం, అచ్చెర్ల, అడ్డాం, మోసయ్యపేట, గోకివానిపాలెం గ్రామాలకు ఆయా రోజుల్లో నిర్దేశిత సమయంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందన్నారు. అసౌకర్యాన్ని మన్నించి, సహకరించాల్సిందిగా ప్రజలను కోరారు.

దైవచింతనతో మానసిక ప్రశాంతత



పోలమాంబిక అమ్మవారి సన్నిధిలో మంత్రి గుడివాడ అమర్‌నాథ్

అనకాపల్లిటౌన్ : దైవచింతన ద్వారా మానసిక ప్రశాంతత కలిగి, ఒత్తిడిని దూరం చేసుకోవచ్చని రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖా మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. గురువారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ దరి పోలమాంబిక అమ్మవారి పండగ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. అంతముందు ఆలయ కమిటీ సభ్యులు మంత్రిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్, జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకిరామరాజు, పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్థిరంగా కూరగాయల ధరలు

కశింకోట : స్థానిక వారపు సంతలో గురువారం కూరగాయల ధరలు దాదాపు స్థిరంగా ఉన్నాయి. వేసవి తాపానికి ఉదయం 11 నుంచి సాయంత్రం 4 వరకు అమ్మకాలు మందకొడిగా సాగాయి. ఉల్లిపాయ, టమాటా, క్యాబేజీ రూ.20, బంగాళాదుంప, వంకాయ రూ.30, దొండకాయ, క్యారెట్, బీట్‌రూట్ రూ.40, బెండకాయ, కాకరకాయ రూ.60, బఠానీ కాయలు రూ.80కి విక్రయాలు సాగాయి.

జగన్ పాలనకు జనం జేజేలు

- గడప గడపకు మన ప్రభుత్వంలో మంత్రి అమర్‌నాథ్
- రూ.19.50 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైనేజీలకు శ్రీకారం



ఎరుకువానిపాలెంలో సీసీరోడ్డు, డ్రైనేజీల నిర్మాణానికి శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్



రాజుపాలెంలో వృద్ధురాలి సమస్యను వింటున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్

అనకాపల్లిటౌన్ : సీఎం జగన్ పాలనకు జనం జేజేలు పలుకుతున్నారని, పార్టీలకు అతీతంగా అర్హత కలిగిన లబ్ధిదారులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించిన ఘనత దేశంలో మన రాష్ట్రానికే దక్కిందని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఐటీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. జీవీఎంసీ విలీన గ్రామమైన రాజుపాలెం, ఎరుగువానిపాలెం గ్రామాల్లో గురువారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఆయనకు ప్రజలు అడుగడుగునా నీరాజనం పలికారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరును ఆరా తీశారు. ఎవరెవరికి ఏ మేరకు లబ్ధి చేకూరిందో వివరించారు. ప్రభుత్వం నుంచి ఇంకేమైనా లబ్ధి చేకూరాలా? అంటూ స్థానికులను అడుగుతూ, వారి సమస్యలను తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలతో రూపొందించిన బ్రోచర్లను లబ్ధిదారులకు అందించారు. ఈ సందర్భంగా మంత్రి అమర్‌నాథ్ మాట్లాడుతూ రోడ్లు, డ్రైనేజీలు, కుళాయిలు కావాలని స్థానికులు ఎక్కువగా తన దృష్టికి తీసుకువచ్చినట్లు తెలిపారు. స్థానికుల అభ్యర్థన మేరకు ప్రమాదకర విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్తవాటిని ఏర్పాటు చేయాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఏ సమస్య వచ్చిన ప్రభుత్వ పరంగా ఆదుకునేందుకు సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు. గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న వ్యక్తికి రెండు సార్లు ఉచితంగా ఆపరేషన్ జరగ్గా, మూడోసారి విడతలో సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి సాయం అందిస్తున్నట్టు వెల్లడించారు. రాజుపాలెం గ్రామంలో దివ్యాంగుడైన కోటి వలంటీర్‌గా విధులు నిర్వహిస్తూ ప్రజల మన్ననలు పొందడం అభినందనీయమన్నారు. అనంతరం ఎరుకువానిపాలెంలో రూ.19.50 లక్షలతో ప్రతిపాదించిన సీసీరోడ్లు, డ్రైనేజీ నిర్మాణానికి మంత్రి అమర్‌నాథ్ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు.

కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ విభాగాల అధికారులు, ఎంపీపీ గొర్లి సూరిబాబు, పార్టీ 80వ వార్డు ఇన్‌చార్జి కొణతాల భాస్కర్, రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్, పార్టీ నేతలు గొల్లవిల్లి నరసింగరావు, మంత్రి సూర్యనారాయణ, రాంబాబు, చిరంజీవి, నాగేశ్వరరావు, నాయుడు, సచివాలయం కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు, పార్టీ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు అనకాపల్లి-పూడిమడక రోడ్డు ప్రారంభం

తుమ్మపాల : పట్టణంలోని 82వ వార్డులో రూ.1.40 కోట్లతో అభివృద్ధి చేసిన అనకాపల్లి-పూడిమడక రహదారిని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఈ నెల 21న ప్రారంభించనున్నట్లు వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకిరామరాజు గురువారం తెలిపారు. పూడిమడక రోడ్డులో దివంగత మహానేత వైఎస్సార్ విగ్రహం వద్ద నిర్వహించే ఈ కార్యక్రమానికి ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి హాజరుకానున్నట్టు పేర్కొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరై, కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిందిగా కోరారు.